# మృత్యోర్మా...అమృతంగమయా!

కాటి సంకర్రావు

**ఆ రోజు సాయంత్రం టెండర్ ఓపెనింగ్ వుండటం వల్ల సెక్షన్‌లోని మిగతా స్టాఫ్‌తో బాటు నేను కూడా లేట్ అవర్స్ వుండవలసి వచ్చింది.**

పర్చేజ్ సెక్షన్‌కు వచ్చిన తరువాత బాధ్యతలతో బాటు పని భారం కూడా పెరిగింది నాకు. ఇంజనీరింగ్ సెక్షన్స్ నుంచి వచ్చే ఇండెంట్లు సార్ట్ అవుట్ చెయ్యడం, ఎంక్వైరీలు పంపించటం, టెండర్ నోటీసులు పబ్లిష్ చెయ్యడం, సప్లయర్స్‌తో నెగోషియేషన్ మీటింగ్స్‌లో పార్టిసిపేట్ చెయ్యడం ... క్షణం కూడా తీరికలేకుండా పోయింది నాకు.

టెండర్ ఓపెనింగ్ వున్న రోజైతే మరీ ఆలస్యమౌతోంది. అయితే ఈ మాత్రం శారీరక శ్రమ, మానసిక వత్తిడి కావాలనే ఈ సెక్షన్‌కు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాను. గుడ్డిలో మెల్లలా అదొక సైకలాజికల్ రిలీఫ్!

ఏడింటికల్లా ఆ పనులన్నీ ముగించుకుని బయటపడ్డాను. కైనెటిక్ హోండా స్టార్ట్ చేసుకుని ... పన్నెండు కిలోమీటర్లు ప్రయాణం చేసి బర్కత్‌పురాలో వున్న ఫ్లాట్‌కు చేరుకునేసరికి ఎనిమిదైపోయింది.

వెహికిల్‌ను తీసుకువెళ్ళి సెల్లర్‌లో పార్క్ చేయబోతూండగా తెలిసింది ... మా కాంప్లెక్స్‌లో కరెంటు లేదని!

ఒక్కసారిగా నీరసం ముంచుకొచ్చింది.

కాళ్ళు మరిక కదలలేమని మొరాయిస్తున్నా ... శరీరంలోని ఏ ఒక్క భాగమూ సహకరించకపోయినా.. . తప్పని పరిస్థితి కాబట్టి ఎలాగోలాగ ఓపిక చేసుకుని మెట్లన్నీ ఎక్కి ఫోర్త్ ఫ్లోర్‌లో వున్న ఫ్లాట్‌కు చేరుకున్నాను.

తీరా వెళ్ళేసరికి తలుపులు తెరిచే వుండడంతో ... అంతవరకూ అనుభవించిన అలసట చిత్రంగా మాయమయ్యింది! ఆలస్యమైనా తన కోసం ఓపిగ్గా ఎదురుచూస్తున్న అరుంధతి మీద అభిమానం పొంగిపొర్లింది.

కొవ్వొత్తి వెదజల్లుతున్న మసక వెలుతురులో జాగ్రత్తగా నడుస్తూ...

"సారీ అరుంధతీ ... టెండర్ ఓపెనింగ్ వుండడం వల్ల కాస్త ఆలస్యమైంది" అంటూ సంజాయిషీ ఇచ్చుకుని తిన్నగా వెళ్ళి సోఫాలో కూలబడ్డాను. చెప్పలు అక్కడే విడిచి, వానిటీ బాగ్‌ను పక్కనే వున్న రైటింగ్ టేబుల్ మీదకు గిరాటేసి అలసటగా కళ్ళు మూసుకుంటూ వెనక్కి జారగిలబడ్డాను.

ముప్పై అయిదేళ్ళ వయసులో పిల్లా పాపలతో హాయిగా గడిచిపోవాల్సిన జీవితం ... ఇలా ఒంటరిగా ఈ ఫ్లాట్‌లో కరిగిపోవడం ... తలుచుకుంటే చిత్రంగా వుంటుంది. నేను ఒంటరితనాన్ని ఎంతగా అసహ్యించుకునేదాన్నో చిన్నప్పుడు. ఎప్పుడూ ఇరుగు పొరుగు వాళ్ళ పిల్లల్ని వెంటబెట్టుకుని ఊరంతా ఊరేగేదాన్ని. స్కూల్లో కూడా ఓ గ్రూప్‌ను ఏర్పాటుచేసుకుని టీచర్లను ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించేదాన్ని.

ఆ హుషారు, ఆ ఆనందం... ఆ ఉత్సాహం నా జీవితంలోంచి ఎప్పుడు ఎగిరిపోయాయో ... ఇప్పుడు మచ్చుకు కూడా లేవు!

ఆలోచనలన్నీ అలా అప్రయత్నంగా గతంలోకి జారిపోతుంటే ... చటుక్కున కళ్ళు తెరిచి తల విదిల్చి ఇహంలోకి రావడానికి ప్రయత్నించాను.

చుట్టూ మసక వెలుతురు ... నా బ్రతుకులాగే చాలీ చాలని వెలుతురు!

అప్పుడు గుర్తొచ్చింది అరుంధతి!

నేను వచ్చి ఇంతసేపైనా అరుంధతి కనిపించదేం? కనీసం లోపల ఓ మనిషి వున్న అలికిడి కూడా వినిపించడం లేదు. నా కోసం కాఫీ కలుపుతుందేమో ననుకున్నా కిచెన్‌లోంచి ఎలాంటి శబ్దమూ వినిపించడం లేదు.

ఎందుకో భయం వేసింది.

గత పదేళ్ళుగా ఒంటరితనానికి అలవాటుపడి యాంత్రికంగా రోజులు నెట్టుకొస్తున్న నాకు ఒంటరితనాన్ని, ఆ నిశ్శబ్దాన్ని చూసి భయం వేసింది. చిత్రంగా వుందే? నాలో నేనే నవ్వుకుంటూ ...

"అరుంధతీ ఎక్కడున్నావ్? లోపల ఏం చేస్తున్నావ్? అసలు కనిపించవేం?" టాయ్‌లెట్ వైపు చూస్తూ కాస్త గట్టిగానే అరిచాను.

జవాబు లేదు. అరుంధతి టాయ్‌లెట్లో కూడా లేదు.

ఎందుకో భయంతో వెన్ను జలదరించింది.

తలుపులు బార్లా తెరిచి అరుంధతి ఎక్కడికెళ్ళినట్టు? అరుంధతి లేకపోతే మరి కొవ్వొత్తులు ఎవరు వెలిగించారు హాల్లో, కిచెన్లో? సోఫాలోంచి లేచి నిలబడ్డాను.

కొంపదీసి బెడ్‌రూమ్‌లో గానీ పడుకుని నిద్రపోవడం లేదు కదా? వెంటనే వెళ్ళి చూడాలని అనిపించింది. కానీ ధైర్యం చాలట్లేదు.

నాగరికత అతి భయంకరంగా ముదిరిపోయిన మా కాంప్లెక్స్‌లో అరిచి మొత్తుకున్నా పక్కవాడి ఇంట్లోకి ఎవ్వరూ తొంగిచూడరు. ఒకరి ఇంటి విష

యాల్లో మరొకరు జోక్యం చేసుకోవడం ... అనే కల్చర్డ్ బ్రూట్స్ చేసే పని అని గట్టిగా నమ్మే సోఫిస్టికేటెడ్ సొసైటీ అది.

"హల్లో లలితా ...బావున్నావా? అరుంధతి లేదు. ఇందాక నేనే పంపించాను... మనిద్దరి నడుమా పానకంలో పుడకలా ఎందుకని ... ఇంటికెళ్లి పడుకోమన్నాను..." నా బెడ్ పక్కనే పడక



అదురుతున్న గుండెను అదిమిపట్టి ... ధైర్యం కూడగట్టుకుంటూ లేచి అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్లి ... నెమ్మదిగా బెడ్‌రూమ్ తలుపు తెరుస్తూ...

"అరుంధతీ" అంటూ పిలిచాను.

కుర్చీ వేసుకుని కాటెయ్యడానికి సిద్ధంగా వున్న విషనాగులా క్రూరంగా చూస్తున్నాడు అతను. నా నవనాడులూ విరిగిపోయాయి.

అతన్ని చూడడం గనక అదే మొదటిసారి అయినట్టయితే, నా గుండె ఎప్పుడో ఆగిపోయేది. అది అదృష్టమో దురదృష్టమో నా ఊహకు అందలేదు.

"ఏం లలితా నా మీద ఇంకా కోపం పోలేదా?" అతని మాటల్లో ఆప్యాయత కన్నా... వ్యంగ్యం తొంగి చూసినట్టనిపించింది.

అసహనంగా, అసహ్యంగా చూశాను అతని వేపు.

నేను ఎలాంటి జవాబు ఇవ్వకపోవడంతో ... నెమ్మదిగా పడక్కుర్చీలోంచి లేచి నావైపు అడుగులు వేశాడు అతను.

నేను రెండు అడుగులు వెనక్కి వేసి గిరుక్కున వెనక్కి తిరిగి వేగంగా వచ్చి సోఫాలో కూలబడి తలపట్టుకున్నాను.

నా జీవితంలో మళ్ళీ అతన్ని చూడాల్సి వస్తుందని కానీ... ఇలా ఒంటరిగా అసహాయంగా ఎదురుపడాల్సి వస్తుందని కానీ కల్లో కూడా ఊహించలేదు. అసలు అతన్ని నా గతానికి సంబంధించిన ఓ జ్ఞాపికగా కూడా భావించలేదు. అతనికి సంబంధించిన నాలుగు సంవత్సరాల కాలాన్ని నా మెమొరీలోంచి ఎరేజ్ చేసి పదకొండేళ్ళయ్యింది.

మధురాతి మధురమైన ఆ నవయవ్వనపు అనుభూతులను ప్రతి ఆడపడుచూ జీవితాంతం గుర్తుంచుకోవటానికి ఆరాటపడితే... నేను ఓ పీడకలగా మరిచిపోవడానికి ప్రయత్నించడం ఎంత దౌర్భాగ్యం?.

నా వెనకే హాల్లోకి వచ్చాడు అతను. రైటింగ్ టేబుల్‌కు ఆనుకుని నిలబడి నా వైపే చూస్తున్నాడు. ఆ చూపుల్లో అభిమానం లేదు. అన్నేళ్ళ తరవాత చూస్తున్నానన్న ఆనందం లేదు. నా పిచ్చిగానీ అతనిలో అలాంటి సున్నితమైన భావాలు ఎక్కడివి?

"ఇన్నేళ్ళైనా నీలో వన్నె తగ్గలేదు లల్లీ... అచ్చం పదిహేనేళ్ళ క్రితం ఎలా వున్నావో ఇప్పుడూ అలాగే వున్నావ్..." అతను అంత దీక్షగా చూస్తున్నది నా అందాన్నన్నమాట!

అసహ్యం వేసింది... అతనిమీదే కాదు ... నా అందం మీద కూడా! అసలు అతన్ని అలా ఎదురుగా నిలబెట్టుకుని అవాకులూ చెవాకులూ పేలుతుంటే పిచ్చి మొద్దులా వింటూ ఎందుకు కూర్చున్నాను నేను.


విసురుగా లేచాను నేను.

"మీరిక దయచేస్తే నేను భోజనం చేసి పడుకోవాలి.." పొంగుకొస్తున్న కోపాన్ని బలవంతంగా అణచుకుంటూ అన్నాను నేను.

అతను ఆశ్చర్యపోయినట్టున్నాడు. తెల్లమొహం

* పారిస్ విమానాశ్రయంలో ఎనౌన్సర్ ప్రయాణికులకు ఈ సూచన చేశాడు:

"మీ మీ విలువైన వస్తువులను ఆ మొదటి డెస్క్‌పై వదిలి వెళ్ళండి"




వేశాడు. నా అందాన్ని అంత సిగ్గువిడిచి పొగిడినా కూడా నిష్కర్షగా మాట్లాడినందుకు స్టన్నైనట్టున్నాడు.

"లలితా... నేను..." అంటూ ఏదో చెప్పబోయాడు కానీ నేను అతనికి ఆ అవకాశం యివ్వలేదు.

"మీరిక వెళ్ళొచ్చు..." అతనితో మరో మాట మాట్లాడడానికి కూడా నాకు మనస్కొప్పడం లేదు. అతని ఉనికిని నాలుగేళ్ళు ఎలా సహించానో గానీ ఇప్పుడు నాలుగు క్షణాలు కూడా భరించలేకపోతున్నాను. అంతటి అసహనం ఆవహిస్తోంది నన్ను.

అతను ఏ కళనున్నాడో... మారు మాట్లాడకుండా వెళ్ళిపోయాడు ... వెళుతూ వెళుతూ వెనక్కి తిరిగి నన్ను చూసి...

"నీ మనసు కష్టపెట్టడం ఇష్టం లేక వెళుతున్నాను లల్లీ... మళ్ళీ రేపొద్దునొస్తాను... నీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి..." అంటూ మెట్లవైపు నడిచి చీకట్లో కలిసిపోయాడు.

అతను అలా వెళ్ళాడో లేదో... కరెంటు వచ్చింది. ఇల్లంతా వెండి వెలుగులతో నిండిపోయింది.

గబగబా వెళ్ళి తలుపేసేశాను.. అతను మళ్ళీ వస్తాడేమోనని భయంతో గుండె వేంగా కొట్టుకుంటూనే వుంది. ఓసారి ఇల్లంతా తిరిగి చూశాను.

దేవుడి ముందుండే దీపపు చెమ్మెను యాష్‌ట్రేగా వాడినట్టుంది. దాన్నిండా సిగరెట్టు పీకలు, బూడిదా నిండిపోయాయి. నా బెడ్ అంతా చిందరవందరగా వుంది. పడక్కుర్చీ పక్కనే ఓ ఖాళీ బాటిల్ కూడా కనిపించింది. జీడిపప్పు వేయింపించుకున్నట్టున్నాడు. ప్లేటులో ముక్కలు పడి వున్నాయి చిందర వందరగా.

అరుంధతి అసలతన్ని లోనికి ఎందుకు రానిచ్చింది? ఈ రాచమర్యాదలన్నీ ఎవర్నడిగి చేసింది? మనిషి గనక ఎదురుగా వుండుంటే ఈ చెంపా ఆ చెంపా వాయించేదాన్ని!

బాత్రూమ్‌లో కెళ్ళాను స్నానం చేద్దామని. అక్కడా సిగరెట్ల కంపే... మందు వాసనే...! ఎలాగోలాగ రెండు చెంబులు క్రుమ్మరించుకుని బట్టలు మార్చుకుని కిచెన్‌లోకి నడిచాను. కానీ ఏమీ తినాలనిపించలేదు. ఫ్రిజ్ తెరిచి చూశాను. రెండు బ్రెడ్డు ముక్కలు కనిపించాయి. జామ్ రాసుకుని తినాలనుకున్నాను కానీ ఎందుకో మనస్కొప్పలేదు. చల్లటి మంచినీళ్ళు ఓ గ్లాసుడు తాగి లైటార్పేసి బెడ్‌రూమ్‌లోకి నడిచాను.

అతను పండి పొర్లిన పక్కమీద పడుకోబుద్ధి కాలేదు. క్రింద చాప పరుచుకుని ఓ దిండు వేసుకుని నడుం వాల్చాను.

ఒంటరితనం నన్ను ఆప్యాయంగా పలుకరించింది. పదకొండేళ్ళుగా అలవాటైన నిశ్శబ్దం నన్ను నిద్రపుచ్చింది. కలలో కూడా ఆ నాలుగేళ్ళ తాలూకు జ్ఞాపకాలు నన్ను కలవరపెట్టలేదు!

తెల తెలవారుతూండగానే కాలింగ్ బజర్ మ్రోగేసరికి ... విసుగ్గా లేచి వెళ్ళి తలుపు తెరిచాను.

అతను!

కళ్ళు ఎర్రగా భయంకరంగా వున్నాయి. జుట్టంతా చెదిరిపోయి వుంది. బట్టలు బాగా నలిగిపోయి వున్నాయి. రాత్రి చీకటి మూలంగానో లేక అతన్ని అంత పరీక్షగా చూడాలనిపించకో తెలీదుగానీ... గమనించలేదు. అతని పరిస్థితి దయనీయంగా వుంది. రాత్రంతా ఏ ఫుట్‌పాత్ మీదో గడిపినట్టున్నాడు.

"మళ్ళీ ఎందుకొచ్చారు?" అతన్నింకా 'మీరు' అంటూ మన్నించగలిగినందుకు ఆశ్చర్యపోయాను.

అతను ఏదో చెప్పబోయేంతలోనే అరుంధతి వచ్చింది. వస్తూనే...

"అదేంటండమ్మా... అయ్యగారప్పుడే ఎల్లిపోతున్నారా?" ఆశ్చర్యంగా అడిగింది. అతన్ని అలా గడపలో చూసి మరోలా అర్థం చేసుకుంది.

వెంటనే ఏం చెప్పాలో అర్థం కాక, అతనికెదు




* కోపెన్ హాగన్ ఎయిర్‌లైన్ టికెట్ల కార్యాలయంలో వున్న నోటీసు బోర్డు:

"మీ లగేజీని అన్ని దిశలకు పంపే పూచీ మాది"

రుగా అలా నిస్సహాయంగా నిలబడలేక విసురుగా, లోపలి కొచ్చేశాను. నా బెడ్‌రూమ్ తలుపేసుకుని మౌనంగా, నిశ్చలంగా కూర్చున్నాను.

అవతల్నించి అతని మాటలూ, అరుంధతి చేస్తున్న మర్యాదలు వినిపిస్తూనే వున్నాయి.

నా ఇంట్లో అరుంధతి పెత్తనం ఏమిటి? అతనలా సిగ్గు విడిచి కొత్త అల్లుడిలా సపర్యలు చేయించుకోవడమేమిటి? వెంటనే వెళ్ళి ఇద్దర్నీ కలిపి ఉతికి ఆరేయాలనిపించింది. మెడ పట్టుకుని గెంటేసి వాళ్ళ మొహం మీదే తలుపు వేసుకోవాలనిపించింది కానీ సభ్యత కాదని ఊర్కున్నాను. నన్ను నేను సంబాళించుకున్నాను.

కాస్సేపయిన తర్వాత అతని మాటలు వినిపించకపోయేసరికి లేచి వెళ్ళి, తలుపు తీశాను. ఎదురుగా హాల్లో సోఫా మీద కూర్చుని టీపాయ్ మీద కాళ్ళు బార్లా చాపుకుని పేపరు చూస్తూ కాఫీ తాగుతున్నాడతను. నా అలికిడి విని కాళ్ళు తీసి కిందపెట్టుకుంటూ పలుకరింపుగా చూసి నవ్వాడు.

వెంటనే మొహం తిప్పుకొని...

"అరుంధతీ వంటయ్యిందా... నాకు ఆఫీసుకు టైమైపోతోంది" కిచెన్‌లోకి చూసి కేకేస్తూ బాత్రూంలోకి నడిచాను. మళ్ళీ అదే సిగరెట్ల కంపు. గబగబా స్నానాదికాలు ముగించి డ్రెస్ చేసుకొని డైనింగ్ టేబుల్ దగ్గరికి నడిచాను.

అరుంధతి సీరియస్‌గా రెండు ప్లేట్లలో వడ్డిస్తూ కనిపించింది.

"అదెవరికి?" ఇంచుమించు అరిచినంత పని చేశాను. అంతవరకూ అతికష్టం మీద అణచుకుంటున్న కోపం కట్టలు తెంచుకుంది.

అరుంధతి హడిలిపోయింది. "అది ... అది..." అంటూ నీళ్ళు నములుతూ ... నా వెనకే డైనింగ్ హాల్లోకి వచ్చిన అతనివైపు చూస్తూ నిల్చుంది.

ఇంక అక్కడ ఒక్క క్షణం కూడా వుండబుద్ధి కాలేదు. అతన్ని తప్పించుకుని గబగబా ఇవతలికి వచ్చేసి ... చెప్పులు వేసుకొని, వేనిటీ బ్యాగ్ తీసుకుని ...

"నీ పని అయిపోగానే ఇంటికి తాళం వేసి క్రింద గూర్ఖాకిచ్చి వెళ్ళు..." అంటూ లిఫ్టు కోసం కూడా ఆగకుండా గబగబా మెట్లు దిగుతూ క్రిందికి చేరుకొని వెహికిల్ తీసి స్టార్ట్ చేశాను.

రాత్రి కూడా భోజనం చెయ్యనందువల్ల కాబోలు కొంచెం నీరసంగా అనిపించింది. రాత్రి ఆలస్యంగా పడుకున్నానేమో కళ్ళు మూతలు పడుతున్నాయ్.

ఆఫీసుకు చేరుకునేసరికి ... ఇంకా ఒక్కరొక్కరే వస్తున్నారు. తిన్నగా నా కేబిన్‌లోకి వెళ్ళి కూలబడ్డాను. గతాన్ని దరిదాపుల్లోకి కూడా రానివ్వకుండా... ఫైళ్ళు ముందేసుకు కూర్చున్నాను. ఆఫీసు పనిలో పడితే నన్ను నేను కాదు, అసలీ లోకాన్నే మరిచిపోతాను నేను!

ఓ కన్‌సైన్‌మెంట్ ఫైనలైజ్ చేసుకోవడానికి వచ్చిన సప్లయర్స్‌తో డిస్కస్ చేస్తుండగా... లోపలికి వచ్చి చెప్పాడు మా అటెండరు వెంకట్రావు.

" 'మీ వారట' వచ్చారు. మిమ్మల్ని అర్జంటుగా చూడాలంటున్నారు. పంపించమంటారా మేడమ్?"

అతని కళ్ళు వెకిలిగా నవ్వుతున్నాయ్.

నేను ఏ సంగతీ చెప్పేంతలోనే వెంకట్రావును తోసుకుంటూ లోనికొచ్చాడు అతను. అదే దయనీయమైన పరిస్థితి. నలిగిన బట్టలు, చెదిరిన జుట్టు, నిప్పు కణికల్లా మండుతున్న కళ్ళు, మాసిన గెడ్డం....

"లల్లీ ... అర్జంటుగా ఓ ఇరవై వేలు కావాలి... మార్వాడీ షాపులో కట్టాలి. మరొక్క గంటలోపు కట్టకపోతే ... కాళ్ళు చేతులు విరగ్గొట్టేస్తానంటున్నాడు... ప్లీజ్ లల్లీ..." ఆందోళనగా చూస్తూ, బిగ్గరగా అరుస్తూ నా టేబుల్ వైపు వడివడిగా అడుగులు వేస్తున్నాడు అతను.

అతని ఎత్తుగడకు నా బుర్ర బ్లాంక్ అయింది. నోట మాట రావడం లేదు.

నా ఎదురుగా కూర్చున్న సప్లయర్స్ నన్నూ, అతన్ని మార్చి మార్చి చూస్తున్నారు. షాకింగ్‌గా చూస్తున్నారు.

అందర్లోకీ ఆ సీన్‌ను బాగా ఎంజాయ్ చేస్తున్నది మా వెంట్రావు ఒక్కడే. అతని కళ్ళల్లో ఇదీ అని చెప్పలేని పైశాచికానందం తాండవిస్తుంది. లేక నాకలా అనిపించిందో...?

"లల్లీ... ప్లీజ్ లల్లీ... ఈ ఒక్క సహాయం చెయ్యి... మళ్ళీ నిన్ను విసిగించను. నీ ఆనందానికి అడ్డురాను. నువ్వేం చెప్పినా వింటాను. ప్లీజ్ లల్లీ..." చిత్రంగా అతని మాటలు నన్నొక వంచకిగా, ఛీట్‌గా, కల్ప్రిట్‌గా చిత్రిస్తున్నాయ్.

నేను ఆలస్యం చేసిన కొద్దీ అతను మరింతగా రెచ్చిపోతాడని గ్రహించి... వెంటనే టేబుల్ డ్రా లాగి చెక్‌బుక్ తీసి అతని పేరు మీదే చెక్ వ్రాసి సంతకం చేసి అతని చేతుల్లో పడేశాను.

అతని కళ్ళు గర్వంగా మెరిశాయి.

గెలిచానన్న సంబరమో, దెబ్బతీశానన్న తృప్తో.. వెళుతూ వెళుతూ...

"థ్యాంక్స్ లల్లీ. థ్యాంక్ యూ వెరీమచ్ వీలైనంత త్వరలో నీ డబ్బు రిటర్న్ చేస్తాను. సమయానికి దేవతలా ఆదుకున్నందుకు చాలా థ్యాంక్స్" అంటూ మరొక్కసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్నాడు.

ఎలాగోలాగ మీటింగ్ అయ్యిందనిపించి సప్లయర్స్‌ను పంపించేశాను.

సెక్షన్‌లో అంతా నా గురించే డిస్కషన్ నడుస్తూ వుంటుందని తెలుసు. అందుకే సాయంత్రం అయిదయ్యే వరకూ కేబిన్ దాటి బయటకు వెళ్ళలేదు.

లంచ్ అవర్లో కూడా భోజనం చెయ్యబుద్ధి కాలేదు. అలా భోజనం చెయ్యకుండా నన్ను నేను హింసించుకోవాల్సిన అవసరం ఎంతమాత్రమూ లేకపోయినా, ఒకరి ముందు తల వంచుకోవాల్సినంత సిగ్గుమాలిన పని ఏదీ చెయ్యకపోయినా... ఎందుకో ఇన్‌ఫీరియారిటీ ఫీలౌతున్నాను.

పదిహేనేళ్ళ క్రితం రెండున్నర లక్షలు పోసి అతన్ని కొన్నారు మా నాన్నగారు. ఆ తర్వాత మరో ఏడాదిలోనే కారనీ, కలర్ టీ.వీ. అనీ లక్ష వరకూ తగలేశారు. నా ఆదాయం లోంచి కూడా చిల్లిగవ్వ కూడామిగలకుండా నెల నెలా జీతం మొత్తం తెచ్చి అతని చేతుల్లోనే పోసేదాన్ని.

అయినా నరకమే. నా జీవితం దినదినగండంగా మారింది. కారణం తెలీదు. యిప్పటికీ నా మట్టి బుర్రకు తట్టనే లేదు. అందుకే చట్టపరంగా అతని నుంచి విముక్తి పొందాను.

ఛ! ఏమిటిది. నిలువెత్తు గొయ్యి తవ్వి పాతేసిన గతం మళ్ళీ నా కళ్ళ ముందు ఎందుకు మెదులుతుంది? గట్టిగా తల విదిలించి ... సెక్షన్‌లోని స్టాఫ్

అంతా వెళ్ళిపోయారని నిర్ధారించుకున్న తర్వాత కేబిన్ దాటి అడుగు బయటపెట్టాను.

"సారీ మేడమ్." పొద్దున్న అతన్ని ఆపడానికి చాలా ప్రయత్నించాను. కానీ అతను నా మాట వినలేదు."

వెంకట్రావు కంఠం సిన్సియర్‌గా ధ్వనించినట్టనిపించింది.

"ఇట్సాల్‌రైట్.." అంటూ మరో మాటకు అవకాశం ఇవ్వకుండా ఇవతలికొచ్చి వెహికిల్ స్టార్ట్ చేశాను.

ఒంట్లో శక్తి పూర్తిగా నశించినట్టుంది. చాలా నీరసంగా వుంది. ఇంటివరకూ క్షేమంగా చేరుకోగలనా అనిపించింది.

ప్రొద్దున్న జరిగిన సంఘటనతో ఊపిరిపోసుకున్న గతం మాటి మాటికీ నా కళ్ళముందు మెదులుతూ విరగబడి నవ్వుతూంది. అతనికి మల్లే అది కూడా నా బలహీనతను కనిపెట్టినట్టుంది. ఇక నన్ను విడిచిపెట్టదు.

వెహికిల్‌ను సెల్లర్‌లో పార్క్ చేసి ... లిఫ్ట్‌లో ఫ్లాట్‌కు చేరుకున్నాను. తలుపులు దగ్గరగా వేసి వున్నాయి. లోపల్నుంచి ఎవ్వరివో నవ్వులు వినిపిస్తున్నాయి. అరుంధతి గొంతు గుర్తుపట్టగలిగాను. మరి ఆ మగగొంతు... అతనిదే!

నెమ్మదిగా తలుపులు తోసుకుని హాల్లో అడుగుపెట్టాను.

హాల్లో అసహ్యకరమైన రీతిలో కనిపించారు వాళ్ళు! నాకన్నా పదేళ్ళు పెద్దదైన అరుంధతి తనకన్నా అయిదారేళ్ళు చిన్నవాడైన అతనితో అలా...

నన్ను చూడగానే దిగ్గున లేచి నుంచుంది అరుంధతి. అతనికి ఆ మాత్రం సిగ్గు కూడా లేనట్టుంది.

హృదయం భగ్గుమంటుంటే, కళ్ళు చంద్ర నిప్పులు కక్కుతుంటే, నా నిండు జీవితాన్ని బలితీసుకున్న ఆ నరరూప రాక్షసుణ్ణే నల్లిని నలిపినట్టు నలిపి చంపాలన్న కోరికను బలవంతంగా అణచుకొని నిప్పుల మీద నడిచినట్టు గబగబా అడుగులు వేస్తూ లోపలికి నడిచాను.

నా అవతారం చూసి జడుసుకున్నట్టుంది... అరుంధతి ఒక్క పరుగులో అవతలికి జారుకుంది. వేనిటీ బ్యాగ్‌ను అక్కడే గిరాటేసి వెళ్ళి తలుపులు మూసేశాను.

అతని కళ్ళు విజయగర్వంతో మెరుస్తున్నాయి. చేసిన పనికి పశ్చాత్తాపంతో, సిగ్గుతో చితికిపోవాల్సిన కళ్ళు మెరుస్తున్నాయి.

గబగబా వెళ్ళి ఓ కలమూ, కాగితమూ తీసుకుని నాలుగు అక్షరాలు గిలికేశాను..

'నా చావుకు నన్ను పుట్టించిన ఆ భగవంతుడే బాధ్యుడు. కానీ అతని చావుకు మాత్రం నేనే బాధ్యురాలిని' రాసి సంతకం చేసి వెనుదిరిగాను.

నా జీవితానికి అదే సరైన ముగింపనిపించింది.

◆



## "శాలరి"కీ ఓ కథ వుంది

* పూర్వకాలంలో సైనికులకు జీతంగా 'ఉప్పు' కొలిచేవారు. 'వారి ఉప్పుతిని బ్రతుకుతున్నాం' అనే వాడుక ఆనాడు వచ్చిందే. రోమ్‌లో కూడా సైనికుల జీతంలో కొంత భాగంగా 'ఉప్పు' కొలిచే ఆచారం వుండేది. లాటిన్ భాషలో 'శాల్' (ఇంగ్లీషులో సాల్ట్) అంటారు. కొన్నాళ్ళు ఉప్పుకు బదులుగా డబ్బు ఇస్తూ దాన్ని 'శాలేరియమ్' (ఉప్పు డబ్బు) అంటూ వచ్చారు. ఆ శాలేరియమ్ నుంచే ఈనాటి ఇంగ్లీషు మాట – 'శాలరీ' (జీతం) వచ్చింది.

– సేకరణ: గోపిశెట్టి మానస

*With best compliments from:*

# EAST INDIA COMMERCIAL COMPANY LTD.

***Lessee of SRI KRISHNA JUTE MILLS***

**ELURU-534 002 (A.P)**

**Manufacturers of all Varieties of Jute Gunny Bags including D.W. Flour Bags, Cement Bags, B. Twill Bags and A. Twill Bags and manufacturers of KRISHNA Brand Jute Twine in all Plys and Jute Yarn in Spools & Cops.**

Telegrams: 'TWINKLE'
TELEX: 4701202-EICC IN

Telephones: 20037 20441
FAX No: 08812-22001